ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 25, క్యారెట్ 50, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 40, కందగడ్డ 35, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 6–7, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డికి శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలిపిన మహేశ్, గోవింద్

అమీర్‌పేట: నగరంలోని మాజీ మంత్రి, వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డిని ఆయన నివాసంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సభ్యుడు మహేశ్, పోలీసు అధికారుల సంఘం మాజీ నాయకుడు గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.

సీపీ జోషిని కలిసిన నేతలు


కేంద్ర మాజీమంత్రి సీపీ జోషితో కోట నీలిమా, విశాల్ సూదం తదితరులు

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంటరీ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో సమావేశం జరిగింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏఐసీసీ పరిశీలకుడిగా నియమితులైన కేంద్ర మాజీమంత్రి సీపీ జోషి హాజరయ్యారు. కాగా సనత్‌నగర్ నియోజకవర్గ నేతలు ఆయనను కలిసి తమ అభిప్రాయాలను చెప్పారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమాతో పాటు సీనియర్ నేతలు విశాల్ సూదం హాజరయ్యారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



అడ్డగుట్ట: అడ్డగుట్ట, మొండి బండనగర్, అంబేడ్కర్ నగర్లలోని వరద బాధితులైన 25 కుటుంబాలకు డీబీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ.. సొంతిళ్లు లేని గృహ కార్మికులకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ మండల నాయకురాలు బన్నమ్మ, రూత్ పాల్గొన్నారు.

రోగి అదృశ్యం


శ్రీనివాసులు

గాంధీఆస్పత్రి: రోగి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ దివిత వాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు (48) కొంతకాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఈనెల 10న గాంధీలో అడ్మిట్ కాగా, వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే రోజు సాయంత్రం చేతికి పెట్టిన క్యానల్ (సెలైన్ ఇంజక్షన్)ను బలవంతంగా తొలగించిన శ్రీనివాసులు బయటకు వెళ్లి తిరిగి వార్డుకు రాలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య మమత పోలీసులను ఆశ్రయించింది. శ్రీనివాసులు 3 నెలలుగా మద్యం తాగడంలేదని, దీంతో మానసిక రుగ్మతలకు గురయ్యాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఒడిశాకు చెందిన పాండ జయప్రకాశ్‌నగర్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి అతడికి ఫోన్ కాల్ వచ్చింది. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కొంత నగదు డిపాజిట్ చేయాలని చెప్పడంతో రూ.82,800లను పంపాడు. అనంతరం ఫోన్ చేయగా నంబర్ బ్లాక్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల దారి..!

ఓవైపు గుంతలు.. మరోవైపు చెత్తమయం


గుంతలమయమైన రహదారి

- వీధిలైట్లు లేక అలుముకుంటున్న అంధకారం
- రహదారికిరువైపులా అక్రమ పార్కింగ్
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- ఈఎస్ఐ–రవీంద్రనగర్ కాలనీ రోడ్డు దుస్థితి

సనత్‌నగర్: అదో కీలకమైన రహదారి.. సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ఎన్నో బస్తీలు, కాలనీలకు అమీర్‌పేట–ఎర్రగడ్డ ప్రధాన రహదారిని అనుసంధానం చేసే రోడ్డు. ఈఎస్ఐసీ ఆస్పత్రితో పాటు మందుల డిపో.. కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కుకు వెళ్లే మార్గం అది. అలాంటి రహదారిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో స్థానికులను ఇబ్బందులు తప్పడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా నాడు మంత్రి హోదాలో ప్రస్తుత ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శంకుస్థాపన చేయగా ఇప్పటికీ శిలాఫలకం దశలోనే దర్శనమిస్తోంది.

ఇలా చెత్త తొలగింపు.. మళ్లీ మొదలు

ఈఎస్ఐసీ రహదారి అపరిశుభ్రతకు నెలవుగా మారుతోంది. రవీంద్రనగర్ ప్రవేశ మార్గంలోనే గార్బేజ్ వల్లరబుల్ పాయింట్ (జీవీపీ) ఉంది. ప్రతిరోజూ ఇక్కడ పేరుకుపోయిన చెత్తను శానిటేషన్ సిబ్బంది తొలగిస్తున్నా.. మళ్లీ కొందరు చెత్త, ఇతర వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

అడుగడుగునా గుంతలమయం..

రవీంద్రనగర్‌తో పాటు బీకేగూడ, ఆదిత్యనగర్, ఉదయ్‌నగర్, ఎస్సార్టీకాలనీ, 60 ఫీట్ల రోడ్డు, బల్కంపేట ఇలా తదితర ప్రాంతాలకు వెళ్లే వారు ఈ మార్గాన్నే ఎక్కువగా అనుసరిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కగల రహదారి గుంతలమయంగా మారింది. ఇక వర్షం పడితే చాలు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

వీధి దీపాలు లేక అంధకారం..

దారి వెంట సక్రమంగా వెలగని వీధి దీపాలతో చీకటైతే చాలు అంధకారం నెలకొంటోంది. ఎన్నో బస్తీలు, కాలనీలకు వెళ్లే ఈ రహదారి అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావట్లేదని రవీందర్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంట నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


పేరుకుపోయిన చెత్త కుప్పలు

అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా..

అసలే ఇరుకు రహదారి.. మరోవైపు ఇరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్‌తో సమస్య మరింత తీవ్రమవుతోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటోలతో పాటు ప్రైవేట్ వాహనాలు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేవారు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.


అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

శ్మశానవాటిక పరిరక్షణకు న్యాయపోరాటం


మాట్లాడుతున్న మాజీ యెగ్గె మల్లేశం, చీర శ్రీకాంత్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ కురుమ కులస్తుల శ్మశానవాటిక పరిరక్షణకు న్యాయం పోరాటం చేస్తామని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. బన్సీలాల్‌పేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు చీర శ్రీకాంత్, శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ మంత్రి కళావతి, ఎం.పి సునీల్, ప్రవీణ్ తదితరులతో కలిసి మాట్లాడారు. వ్యాపారులు, ఇతరత్రా వ్యక్తులు 1966 గజాల శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. త్వరలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శ్మశానవాటిక కబ్జా విషయాన్ని వివరిస్తామని చెప్పారు. బీజేపీ నాయకుడు చీర శ్రీకాంత్ మాట్లాడుతూ.. శ్మశానవాటిక పరిరక్షణకు కలిసి కట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కురుమ సంఘం స్థానిక నాయకులు నటరాజ్, బాలకృష్ణ, కుమార్, దినేశ్, అరుణ్‌కుమార్, సంతు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


గౌతమ్ రావుతో బౌద్ధనగర్ నాయకులు

బౌద్ధనగర్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎన్. గౌతమ్ రావును రాష్ట్ర కార్యాలయంలో బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్ గౌడ్, బౌద్ధ నగర్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ దత్తు, జయంత్ తదితరులు ఉన్నారు.

వాటర్ ప్యూరీఫైడ్ కేంద్రాలు ప్రారంభం

గాంధీఆస్పత్రి: మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్యూరీఫైడ్ వాటర్ కేంద్రాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులను ఆమె అభినందించారు. త్వరలోనే మరో 25 ఆర్వో యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఫౌండేషన్ ట్రస్ట్ మంచుకొండ వరుణ్ కుమార్ తెలిపారు. అంతేగాకుండా నిర్వహణ బాధ్యతలు కూడా తామే చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రావణ్, ప్రతినిధులు మల్లేశం, సతీశ్, గాంధీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగ హెచ్ఓడీ కేటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ వాణి, ఫౌండేషన్ ప్రతినిధులు

కనుల పండువగా కల్యాణోత్సవం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

చిలకలగూడ: నామాలగుండు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నోముల ఇందిరా ప్రకాశరావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోరిక మేరకు ప్రతినెల రెండో శనివారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. అనంతరం అన్నదానం చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, భక్తులు బిట్ల రఘునందన్, శ్రీనివాసగౌడ్, రవి, వేణు, గరికపోగుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం వారసత్వాన్ని కాపాడాలి

పంజగుట్ట: హైదరాబాద్ ప్రజల కోసం తమ పూర్వీకులైన నిజాంలు విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను నిర్మించారని, 1965 యుద్ధం సమయంలో భారత రక్షణకు 425 కిలోల బంగారం దానం చేశారని, వారి వారసత్వాన్ని కాపాడటం ఈ దేశం కర్తవ్యమని తొమ్మిదవ నిజాం నవాబ్ రౌనక్ యార్ ఖాన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారి న్యాయసలహాదారు మొహమ్మద్ వేకార్ హుస్సేన్‌తో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని కంచ గచ్చిబౌలిలో సర్వే నంబర్ 25, 26లో 2,725 ఎకరాల భూమి ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్‌కు చెందినదన్నారు. సదరు భూమి నిజాం కుటుంబ చట్టబద్ధ యాజమాన్యాన్ని రక్షించాలని, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అనధికార ఆక్రమణను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసినట్లు వారు పేర్కొన్నారు. తాము కోర్టులో కేసు సంపద కోసమో హోదా కోసమో వేసింది కాదని, న్యాయం కోసం, చరిత్ర ప్రజలకు తెలియాలని, అభివృద్ధి పేరుతో చరిత్రను అంతం చేయకుండా కాపాడేందుకే అన్నారు. కంచె గచ్చిబౌలి భూముల్లో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఆక్రమణలు, చెట్ల నరికివేత జరుపుతూ, చారిత్రక వారసత్వానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, ఇది అభివృద్ధి పేరుతో విధ్వంసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో అసఫ్ జాహీ రాజవంశ వారసులు నవాబ్ మిర్ మిలాద్ అలీ ఖాన్, నవాబ్ మిర్ ఉస్మాన్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నవాబ్ రౌనక్ యార్ ఖాన్

15న డా.కలాం బెస్ట్ టీచర్స్ అవార్డ్స్

హిమాయత్‌నగర్: డా.ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని డా.కలామ్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్–25 కార్యక్రమాన్ని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) భాగస్వామ్యంతో ఈనెల 15న ఉదయం 10 గంటలకు రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు లీడ్ ఇండియా ఫౌండేషన్ స్థాపకుడు ప్రొ.ఎస్. బాలకృష్ణ సుదర్శన్ ఆచార్య తెలిపారు.

భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య

వెంగళరావునగర్: భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివసించే సీహెచ్.శోభన్‌బాబు డెలివరీ బాయ్. మూడేళ్ల క్రితం యువతితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. ఇటీవల భార్యపై అనుమానం పెంచుకొని మానసికంగా బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శోభన్‌బాబు తండ్రి ఉపేంద్ర మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెస్ట్ టీచర్ అవార్డుల ప్రదానం


బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంటున్న డా. మీనా

లాలాపేట: ఇటీవల రవీంద్రభారతిలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో (యునెస్కో గుర్తించిన) ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ రాజారపు మీనాకు ఏఐసీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయరాజు గడ్డపాటి బెస్ట్ టీచర్ అవార్డును మెమొంటో ప్రశంసా పత్రాన్ని అందజేశారు. దీంతో యూకే కాలేజీ కరస్పాండెంట్ డా. విద్యాప్రవంతి మీనాకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం ఈమె యూకే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్: ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఏ.యోగేందర్ ప్రైవేట్ జాబ్ చేస్తూ ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్నాడు. గత నెల 30వ తేదీన తన రూం వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి స్వగ్రామం వెళ్లి తిరిగి ఈ నెల 7వ తేదీన వచ్చి చూసేసరికి కనిపించలేదు. దాంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఏకాత్మ స్తోత్రం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

లాలాపేట: ఇతిహాస సంకలన సమితి తెలంగాణ, రాష్ట్ర చింతన ఉప్పల్, మల్కాజిగిరి భాగ్‌ల సంయుక్తాధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో శుక్రవారం రాత్రి 'ఏకాత్మ స్తోత్రం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. అఖిల భారత సహ సంపర్క్ ప్రముఖ్ సునీల్ దేశ్‌పాండే ముఖ్య అతిథిగా, లింగం శ్రీధర్ ముఖ్య వక్తగా, ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కిషన్‌రావు తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నేటి యువత భారతీయ చరిత్ర, వైభవాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రచయిత సాయివరప్రసాద్, కార్యదర్శి వీరేందర్, రాష్ట్ర చింతన్ సంయోజక్ బస్వారెడ్డి, ఉప్పల్, మల్కాజిగిరి సంపర్క్ ప్రముఖులు గుల్లపల్లి కుమారస్వామి, రమేశ్ తదితరులు ఉన్నారు.

తార్నాకలో మూలం సంత ప్రారంభం


మూలం సంతను ప్రారంభిస్తున్న దృశ్యం

లాలాపేట: సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్, గ్రామ భారతీ సంయుక్తాధ్వర్యంలో తార్నాక మర్రి కృష్ణా హాల్లో శనివారం 16వ మూలం సంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొ జయశంకర్ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ పి.వి రావు, ఏకలవ్య గ్రామీణ వికాస్ పరిషత్ చైర్మన్ జ్యోతి తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గో వ్యవసాయాధారిత వస్తువులతో ఏర్పాటు చేస్తున్న సంతను ప్రజలందరూ ఆదరించాలని, ప్రకృతి సేద్యంతో పండించిన వస్తువులను తీసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 100 కు పైగా స్టాల్స్‌లో 500 రకాల వస్తువులను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ఫౌండేషన్ మర్రి కృష్ణ, వసుదాదేవి, ఫౌండేషన్ సభ్యులు జ్యోతి,హేమ, గ్రామభారతీ మూలం సంత కోఆర్డినేటర్ బొమ్మకంటి మల్లేశం తదితరులు ఉన్నారు.

బీసీ బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాల మద్దతు


మాట్లాడుతున్న ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నేతలు

లాలాపేట: రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14న నిర్వహించే బంద్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నిలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్ అంశాన్ని మరింత జాప్యం చేయకుండా అన్ని రాజకీయ పార్టీలు కలిసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బొల్లెపల్లి స్వామి గౌడ్, ఎస్ నాగేశ్వర్‌రావు, డా. లక్ష్మీగారి అంజనేయులు, ఓయూ శంకర్, నిఖిల్, నరేశ్, జూలూరి మహేశ్, శ్రీకాంత్, సాయిలు తదితరులు ఉన్నారు.

సమాజహితం కోసం పని చేయాలి


మాట్లాడుతున్న మంత్రి డి. శ్రీధర్‌బాబు

బన్సీలాల్‌పేట్: ధర్మాన్ని రక్షిస్తూ.. వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటూ ప్రతిఒక్కరూ లోక కల్యాణార్థం కోసం పని చేయాలని రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ శ్రీ స్కందగిరి ఆలయ ఆవరణలో జరుగుతున్న శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ వేడుకలు, తెలంగాణ వేద విద్వన్మహాసభలకు శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మాన్ని కాపాడే ప్రయత్నాన్ని వేదపండితులు కొనసాగించాలని సూచించారు. వేద విద్య వ్యాప్తికి చేస్తున్న కృషికి తమ తోడ్పాటునందిస్తామన్నారు. అలాగే పలువురు వేదపండితులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్ కేఐ వరప్రసాద్ రెడ్డి, పురుషోత్తం శర్మ, ట్రస్ట్ చైర్మన్ తూములూరి శాయినాథ శర్మ, పసుమర్తి బ్రహ్మానంద శర్మ, చింతపల్లి సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, స్కందగిరి మేనేజింగ్ ట్రస్టీ కృష్ణ న్ రాజమణితో పాటు పెద్ద సంఖ్యలో వేదపండితులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

అమీర్‌పేట: మాతా సేవా సమితి ఆధ్వర్యంలో సనత్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్ నగర్ కమ్యూనిటీ హాల్లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు చేయగా, 14 మందికి శస్త్ర చికిత్స, 70 మందికి కళ్లద్దాల అవసరముందని వైద్యులు తెలిపారు. త్వరలో ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్లద్దాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ కళ్లె శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో జరిగిన కార్యక్రమంలో లయన్ రాజశేఖర్, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు కుసుమ విజయ రాధిక, కమల, శ్రీదేవి గయాగ్నిక్ సెంటర్ టెక్నీషియన్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

బౌద్ధనగర్: స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లైఫ్ స్ప్రింగ్ మెటర్నటీ హాస్పిటల్ సౌజన్యంతో వారసిగూడలోని గంగపుత్ర సొసైటీ భవనంలో శనివారం ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భగా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన్ రఘు మాట్లాడుతూ.. ప్రతి 3 నెలలకు ఒకసారి శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సదానంద, వంగల సుధాకర్, సునీల్, చల్లూరి సంజీవ్, అంబటి రమేశ్, ముద్రగడ శివ, కర్మకొండ విశాల్ తదితరులు పాల్గొన్నారు.


మాతా సేవా సమితి ఆధ్వర్యంలో..


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చిలకలగూడ: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్‌పీ రైల్వేఠాణా పరిధిలో జరిగింది. హెచ్‌సీ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10న సాయంత్రం 6.30 గంటలకు చర్లపల్లి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా విశాఖ ఎక్స్‌ప్రెస్ ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి జేబులో చీటీ ఆధారంగా దర్యాప్తు చేపట్టగా జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన మండల రాజు (57)గా గుర్తించారు. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న రాజు 3 రోజుల క్రితం చర్లపల్లిలో తిరుగుతుండగా అదే ప్రాంతంలో ఉంటున్న తిమ్మంపేటకు చెందిన నరేశ్ గమనించి చేరదీశాడు. తన ఫోన్ నంబరును రాజు షర్టు జేబులో పెట్టి ఏదైన అవసరం ఉంటే ఫోన్ చేయమని చెప్పాడు. ఈ నేపథ్యంలో రైలు ప్రమాదంలో మృతి చెందిన రాజు మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు గుర్తు పట్టడంతో శనివారం పోస్టుమార్టం నిర్వహించి రాజు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ కోటేశ్వరరావు తెలిపారు.